క్లుప్తంగా

కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యత



ఎమ్మెల్యేతో వైఎస్‌ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి

కర్నూలు(రాజ్‌విహార్): కార్మికుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని వైఎస్‌ఆర్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీ ఫైబర్ నెట్ చైర్మన్ గౌతంరెడ్డి అన్నారు. ఆదివారం కర్నూలుకు వచ్చిన ఆయన స్థానిక పాతబస్తీలోని ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్ కార్యాలయంలో కాసేపు కార్యకర్తలతో మాట్లాడారు. అన్ని వర్గాలతో పాటు కార్మికుల సమస్యల పరిష్కారం, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు తమదేనని, ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని సూచించారు.

సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయండి

కర్నూలు(సెంట్రల్) : సెప్టెంబర్ 1వ తేదీన జరిగే సీపీఐ బస్సు యాత్రను విజయవంతం చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం ఎద్దుల ఈశ్వర్‌రెడ్డి నగర శాఖ జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఒకటో తేదీ సాయంత్రం 4 గంటలకు బస్సు యాత్ర కర్నూలులోని నంద్యాల చెక్‌పోస్టుకు చేరుకుంటుందన్నారు. అక్కడి నుంచి సుమారు 1000 మందితో పాతబస్టాండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ జరుగుతుందన్నారు. అనంతరం అక్కడే బహిరంగ సభ నిర్వహిస్తామని, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, రాష్ట్ర సహాయ కార్యదర్శులు జేవీ సత్యనారాయణమూర్తి, ముప్పాళ్ల నాగేశ్వరరావు తదితరులు హాజరవుతారని చెప్పారు.

భక్తి శ్రద్ధలతో ఝులన్ యాత్ర



హరేకృష్ణ సంకీర్తన చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక ఇస్కాన్ జగన్నాథ మందిరంలో ఆదివారం శ్రీ రాధా గోవిందుల ఝులన్ యాత్ర ఉత్సవాలు, శీల ప్రభు పాదుల ప్రేమ విందు, భగవద్గీత శిక్షణ తరగతులు నిర్వహించారు. జగన్నాథ్, సుభద్ర, బలదేవ్‌లను ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కలిపించారు. ఊయల సేవ, ప్రవచనం, మహారాజ భోగ నివేదన చేశారు. ఇస్కాన్ బాధ్యులు రామకృష్ణ ప్రభు సందేశం ఇచ్చారు. ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలన్నారు. పురాణ ఇతిహాసాలను పఠనం చేయాలన్నారు. అనంతరం హరే రామ హరే కృష్ణ నామ సంకీర్తన జప యజ్ఞం నిర్వహించారు. కార్యక్రమంలో ఇస్కాన్ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

కేసీ కాల్వకు నీరు విడుదల

గూడూరు: సుంకేసుల జలాశయం నుంచి కేసీ కాల్వకు 331 క్యూ సెక్కుల నీరు విడుదల చేసినట్లు ఆదివారం డ్యామ్ అధికారులు తెలిపారు. జలాశయానికి ఇన్ ఫ్లో నిలిచి పోయిందని, ప్రస్తుతం 0.751 టీఎంసీల నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలి

కల్లూరు: ప్రకృతి వ్యవసాయ సిద్ధాంతాలు, దాని వెనుక ఉన్న శాస్త్రీయ పరిజ్ఞానాన్ని పెంపొందించుకొని వాతావరణ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రకృతి వ్యవసాయాన్ని ఆచరించాలని రైతు సాధికార సంస్థ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ రైతు శాస్త్రవేత్తలకు, మెంటర్లకు సూచించారు. ఆదివారం కర్నూలు ఉద్యాన భవన్ రైతు శిక్షణ కేంద్రంలో జూమ్ మీటింగ్ ద్వారా రిజినల్ స్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి అతిథులుగా రాష్ట్రస్థాయి థిమాటిక్ లీడ్స్ సుధాకర్, సురేష్, కన్సల్టెంట్ లక్ష్మయ్య హాజరయ్యారు.

మన సంస్కృతి, సంప్రదాయాలు గొప్పవి



మాట్లాడుతున్న డాక్టర్ పార్వతి

కర్నూలు కల్చరల్: భారత భూమి వేద భూమి అని భారత దేశంలో జన్మించినందుకు గర్వపడాలని విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ పార్వతి అన్నారు. విశ్వ హిందూ పరిషత్ జిల్లా మాతృ శక్తి సమ్మేళనం ఆదివారం స్థానిక భరత మాత ఆలయ ప్రాంగణంలో జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ మన దేశ సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్ర చాలా గొప్పవన్నారు. చిన్మయ మిషన్ జిల్లా బాధ్యులు స్వామిని సుప్రేమానంద మాట్లాడుతూ రామాయణం, భారత భాగవతం లాంటి ఇతి హాసాలను భావి తరాలకు వివరించాలన్నారు. సాహితీ వేత్త కర్నాటి చంద్ర మౌళిని, వీహెచ్‌పీ రాష్ట్ర మాతృశక్తి కన్వీనర్ సాదీకర్ గౌరీ మాట్లాడారు. మాతృశక్తి జిల్లా కన్వీనర్ జంపాల రాధిక అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నందిరెడ్డి పార్వతీ, లక్కిరెడ్డి అరుణ, మాతృ శక్తి, దుర్గా వాహిని విభాగాల కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్రదానం..చూపు సజీవం

- నేత్రదానంతో ఇరువురికి చూపు
- జిల్లాలో విస్తృతంగా నేత్రదాన అవగాహన కార్యక్రమాలు
- ఏటా 200 నుంచి 400 మంది నుంచి కనుగుడ్లు సేకరణ
- మరింత నేత్రదానాలు పెరిగేలా అధికారుల కృషి
- మూఢనమ్మకాలతో ముందుకు రాని కొద్దిమంది
- వచ్చే నెల 8వ వరకు నేత్రదాన పక్షోత్సవాలు

'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అంటే శరీరంలోని అన్ని అవయవాల కంటే కళ్లు ప్రధానమైనవి అని అర్థం. అయితే, కొందరు పుట్టుకతో అంధులుగా, మరికొందరు ప్రమాదాల బారిన పడి కళ్లు కోల్పోయి జీవిస్తుంటారు. ఇలాంటి వారికి నేత్రదానం చేస్తే వారి జీవితాల్లో వెలుగులు ప్రసాదించినవారవుతాం. ఈ దిశగా ప్రభుత్వం ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 25 నుంచి వచ్చే నెల 8వ తేదీ వరకు నేత్రదాన పక్షోత్సవాలు నిర్వహిస్తోంది.



ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి



కర్నూలు(హాస్పిటల్): జిల్లాలో నేత్రదానంపై ప్రజల్లో ఇంకా మూఢనమ్మకాలు వీడటం లేదు. అనారోగ్యంతో, ప్రమాదాల్లో ప్రతిరోజూ ఎంతో మంది చనిపోతున్నా నేత్రదానం చేసేవారి సంఖ్య చాలా తక్కువగా ఉంటోంది. దీనికి ప్రధాన కారణం మూఢనమ్మకం. చనిపోయాక కళ్లు(కార్నియా) తొలగిస్తే మరుజన్మలో గుడ్డి వారిగా జీవిస్తారని, వారి ఆత్మలు సైతం కళ్లు లేకుండా తిరుగుతాయని చాలా మంది భావిస్తూ ఉంటారు. అలాంటిది కేవలం భ్రమ, మూఢనమ్మకం మాత్రమేనని, ఒకరి నేత్ర దానం మరో ఇద్దరికి కంటిచూపును ప్రసాదిస్తుందని, దీనివల్ల చనిపోయినా కూడా ఈ ప్రపంచాన్ని వారి కళ్లతో చూసే గొప్ప అవకాశం మనిషికి కలుగుతుందని వైద్యులు, సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారు. ఈ కారణంగా ఇటీవల కాలంలో నేత్రదానికి ముందుకు వచ్చే వారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ఇందులో భాగంగా ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలోని జిల్లా అంధత్వ నివారణ సంస్థ ద్వారా అధికారులు, టెక్నీషియన్లు సైతం ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో విస్తృతంగా నేత్రదానంపై అవగాహన కల్పిస్తున్నారు. ఎక్కడైనా, ఎవ్వరైనా మరణించినట్లు ఆరు గంటల్లోపు సమీపంలోని కంటి సేకరణ కేంద్రం/ఐ బ్యాంక్(ఫోన్: 08518-255575, సెల్ : 9849903116, 9840692299)కు వివరిస్తే వారు వచ్చి నేత్రాలను సేకరిస్తారు. అనంతరం వారికి కృత్రిమ నేత్రాలను అమర్చడం ద్వారా ఎలాంటి అవయవ లోపం కనిపించదు. ఇలా సేకరించిన వాటిని హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి పంపిస్తున్నారు. అక్కడ నేత్రాలు అవసరమైన వారికి వీటిని అమర్చి చూపును ప్రసాదిస్తున్నారు.

కనుగుడ్డు ఎలా దెబ్బతింటుందంటే...!

కార్నియా అంటే కంటిలోని పల్చటి పారదర్శక పొర, కనుపాప ముందర ఉంటుంది. ఇది ఇన్‌ఫెక్షన్ ద్వారా, దెబ్బతగలడం, ఆహార లోపం(విటమిన్-ఎ, విటమిన్- డి), అన్ని రకాల పోషకాహారలోపం వల్ల ఈ పారదర్శక పొర మసకబారి తెల్లని పొర ఏర్పడుతుంది. ఈ కారణంగా కంటి చూపు కోల్పోతారు. పుట్టుకతో తల్లి గర్భంలో ఇన్‌ఫెక్షన్ రావడం వల్ల నల్లగుడ్డు ఏర్పడే సమయంలో తెల్లబడి ఉండటం జరుగుతుంది. ఇది వైరల్, ఫంగల్ బ్యాక్టీరియల్ ఇన్‌ఫెక్షన్, పసురు కంటిలో పోయడం వల్ల సంభవిస్తుంది. ఇలాంటి వారికి దాతల నుంచి సేకరించిన నల్లగుడ్డును అమర్చడం ద్వారా కంటి చూపు వస్తుంది.

కార్నియా దానానికి అర్హులు

ఆడ, మగవారు ఏ వయస్సు వారైనా, ఏ ఆర్థిక స్థోమతలో ఉన్నా, చక్కెర, బీపీ, కొన్ని వ్యాధుల వల్ల చనిపోయిన వారు కూడా ఈ నేత్రదానానికి అర్హులు. కుక్కకాటుతో(రేబిస్ వ్యాధి), హెచ్ఐవీ/ఎయిడ్స్, క్యాన్సర్ వ్యాధితో చనిపోయిన వారి నేత్రదానానికి పనికిరావు.

నేత్రాలను ఎలా సేకరిస్తారంటే..

నేత్రదానం చేసే వారి కుటుంబసభ్యులకు ఎలాంటి ఛార్జీలు(ఫీజు) ఉండవు. ఈ నేత్రాలను ఉచితంగా వైద్యుల బృందం వెళ్లి వారి దగ్గరనే సేకరిస్తారు. ఈ నేత్రాలను వారి ఇళ్ల వద్ద కూడా సేకరిస్తారు. సేకరించిన నేత్రాలను విక్రయించడం, కొనడం కానీ జరగదు. ఈ నేత్రాలను ఉచితంగా ఇతరులకు అమరుస్తారు.


విస్తృతంగా నేత్రదాన పక్షోత్సవాలు

జిల్లా అంధత్వ నివారణ సంస్థ, ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 25వ తేదీ నుంచి సెప్టెంబర్ 8వ తేది వరకు నేత్ర దాన పక్షోత్సవాలు నిర్వహించనున్నారు. 28న పగిడిరాయి పీహెచ్‌సీ, 29న స్థానిక ఎ.క్యాంపులోని ఇందిరమ్మ స్మారక మున్సిపల్ హైస్కూల్‌లో, 30న కల్లూరు పీహెచ్‌సీలో, 31న హర్దగేరి పీహెచ్‌సీలో, ఒకటిన గోనెగండ్ల పీహెచ్‌సీలో, 2న కోసిగి పీహెచ్‌సీలో, 4న ఎమ్మిగనూరు ఏరియా ఆసుపత్రిలో, 5న కర్నూలులోని ఆర్యవైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, 6న ప్రభుత్వ నర్సింగ్ కాలేజీలో, 7న ఆదోనిలోని ఏరియా ఆసుపత్రిలో, 8న ప్రాంతీయ ప్రభుత్వ కంటి ఆసుపత్రిలో నేత్రదానంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

జిల్లాలో నేత్రదానం చేసిన వారి సంఖ్య

సంవత్సరం	నేత్రదానాల సంఖ్య
2015-2016	175
2016-2017	373
2017-2018	368
2018-2019	349
2019-2020	377
2020-2021	176
2021-2022	264
2022-2023	412
2023-2024 ఇప్పటివరకు	88

నేత్రదానానికి ముందుకు రావాలి



ప్రతిరోజూ ఎంతోమంది చనిపోతున్నా నేత్రదానానికి ముందుకు రావడం లేదు. ఒకరి నేత్రదానంతో మరో ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చు. నేత్రదానంపై ఇప్పటికీ ప్రజల్లో అనుమానాలు, అపోహలు, మూఢనమ్మకాలు ఉన్నాయి. మరణించిన అనంతరమే వ్యక్తి కళ్ల నుంచి కార్నియాను వైద్యసిబ్బంది సేకరిస్తారు. దాని స్థానంలో కృత్రిమ కార్నియాను అమరుస్తారు. దీనివల్ల మరణించిన వ్యక్తికి అవయవ లోపం కనిపించదు.

– డాక్టర్ పృథ్వీ వెంకటేశ్వర్లు, ప్రాంతీయ ప్రభుత్వ కంటి వైద్యశాల సూపరింటెండెంట్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్

కర్నూలు(రాజ్‌విహార్): రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎలాంటి సిఫార్సు లేకుండా అర్హులందరికీ అందిస్తున్నామని కర్నూలు ఎమ్మెల్యే హాఫీజ్‌ఖాన్ అన్నారు. ఆదివారం రాత్రి ఆయన స్థానిక 52వ వార్డులో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో కలిసి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంనిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా కోర్టు ప్రాంతంలోని వీధుల్లో ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఉన్న జన్మభూమి కమిటీలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్వస్తి పలికి సచివాలయ వ్యవస్థ ద్వారా పథకాలు అందజేస్తున్నట్లు చెప్పారు. ప్రతి పేద కుంటుంబ దరఖాస్తు చేసుకుని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సర్దార్, మహేష్, రమణ, ఇబ్రు, మునిస్వామి, సుబ్బు, చిన్ని, సిద్ధయ్య, కార్యకర్తలు పాల్గొన్నారు.

పార్టీ అభ్యున్నతికి పాటు పడాలి



పార్టీ శ్రేణులతో జిల్లా అధ్యక్షుడు, మేయర్ రామయ్య

కల్లూరు: అందరూ సమన్వయంతో పనిచేసి పార్టీ అభ్యున్నతికి పాటు పడాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, నగర మేయర్ బీవై రామయ్య సూచించారు. ఆదివారం మేయర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ కమిటీల ఏర్పాటుపై కర్నూలు నియోజకవర్గ నాయకులతో చర్చించారు. ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు మరో 8 నెలలే మిగిలిందని, ఈ తరుణంలో నూతన కమిటీల పనితీరు చాలా కీలకమన్నారు. రాబోయ్యే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని అందరూ క్షేత్రస్థాయిలో సమన్వయంతో ప్రభుత్వ ప్రజారంజక పాలనను ప్రజలకు వివరించాలన్నారు. ప్రతిపక్షాల చేస్తున్న అసత్య ఆరోపణలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తూ, ప్రతిపక్షాల తీరును ఎండగట్టాలని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల అభ్యున్నతికి నామినేటడ్ పదవులతో పాటు, అనేక పదవులు సృష్టించి అందరికి అవకాశం కల్పించారన్నారు. కష్టపడ్డవారిని గుర్తించి న్యాయం చేసే ఏకైక పార్టీ వైఎస్సార్‌సీపీనే అన్నారు. కార్యక్రమంలో సీహెచ్ మద్దయ్య, ఆదిమోహన్ రెడ్డి, శ్రీరాములు, రైల్వే ప్రసాద్, దేవపూజ ధనుంజయ ఆచారి, రవిగౌడ్, బత్తుల లక్ష్మీకాంతయ్య, భాస్కర్‌రెడ్డి, శ్రీను, బంగారు రాజశేఖర్ పాల్గొన్నారు.

సాంఘిక నాటకాలతోనే సమాజ చైతన్యం



జి.ఎల్.ఎన్.మూర్తి స్మారక పురస్కారాన్ని మహమ్మద్ రఫీకి అందజేస్తున్న అతిథులు

కర్నూలు కల్చరల్: సమాజ చైతన్యానికి సాంఘిక నాటకాలు ఎంతో దోహద పడతాయని విశ్రాంత ఐఏఎస్, సీనియర్ కళాకారులు గుమ్మళ్ల బలరామయ్య అన్నారు. కళావిపంచి, టీజీవీ కళాక్షేత్రం సంయుక్త ఆధ్వర్యంలో సీక్యాంప్‌లోని టీజీవీ కళాక్షేత్రంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న సాంఘిక నాటకోత్సవాల ముగింపు కార్యక్రమం ఆదివారం జరిగింది. బలరామయ్య, రామరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు రామరాజు శ్రీనివాసరావు, కథక్ కళాకారుడు అంజిబాబు, నాటక ప్రయోక్త డి. రామకోటేశ్వరరావు, ఆదిలీలా ఫౌండేషన్ అధ్యక్షుడు ఎస్.ఆదినారాయణ, టీజీవీ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా బలరామయ్య మాట్లాడుతూ కర్నూలులో క్రమంగా సాంఘిక నాటకాలకు ఆదరణ పెరుగుతుందన్నారు. కళలను, కళాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. జీఎల్ఎన్ మూర్తి స్మారక పురస్కారాన్ని హైదరాబాద్ కళ పత్రిక ఎడిటర్ మహమ్మద్ రఫీకి అతిథులు ప్రదానం చేశారు. అనంతరం ప్రదర్శించిన మల్లాది క్రియేషన్స్ వారి 'తులసి తీర్థ', హైదరాబాద్ సిరిమువ్వ కల్చరల్ వారి 'థింక్' నాటికలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కళావిపంచి అధ్యక్షుడు బొప్పన నరసింహరావు, ముఖ్య సలహాదారుడు డి. రామకోటేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి జి.వి.జి. శంకర్, కళాక్షేత్రం కార్యదర్శి మహమ్మద్ మియ్యా, కోశాధికారి లక్ష్మీకాంత రావు, సభ్యులు యాంగటీశ్వరప్ప, సంగా ఆంజనేయులు, క్రిష్టఫర్, బాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కుటుంబసభ్యుల చెంతకు వృద్ధురాలు



కోలుకున్న యశోదమ్మను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న 4వ పట్టణ పోలీసులు

కర్నూలు(అగ్రికల్చర్): తప్పిపోయి అపస్మార స్థితిలో పడి ఉన్న కర్ణాటకకు చెందిన ఒక వృద్ధురాలిని కర్నూలు నాలుగో పట్టణ పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుని కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. ఈ నెల 13న ఆటో నగర్ సమీపంలోని ఫ్లెవైర్ బ్రిడ్జి పక్కన ఉన్న సర్వీస్ రోడ్డుపై గాయాలకు గురై ఆపస్మారక స్థితిలో వృద్ధురాలు ఉండగా పోలీసులు గుర్తించారు. వెంటనే వారు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం కర్నూలు సర్వజన వైద్యశాలకు తరలించారు. మతిస్థిమితం సరిగ్గా లేకపోవడంతో ఆమె కర్నూలు వచ్చారు. ఆసుపత్రిలో చికిత్స వల్ల కొంత వరకు ఆరోగ్యం కుదుట పడటంతో వృద్ధురాలు తన వివరాలు వెల్లడించింది. పేరు యశోదమ్మ అని బెంగుళూరులోని అరికెర ప్రాంతం తనదని పోలీసులకు చెప్పారు. పోలీసులు ఆమె కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆదివారం సాయంత్రం వారు 4వ పట్టణ పోలీసు స్టేషన్‌కు రాగా వృద్ధురాలిని అప్పగించారు. కాగా యశోదమ్మ తప్పిపోయినట్లు ఈ నెల 16న కర్ణాటకలో కేసు నమోదైంది.

అక్రమంగా నాపరాయి తరలిస్తే చర్యలు

కర్నూలు (న్యూసిటీ) : అక్రమంగా నాపరాయిని తరలిస్తే కఠిన చర్యలు తప్పవని జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ హెచ్చరించారు. ఎలాంటి అనుమతి లేకుండా నాపరాయిని తరలిస్తున్న రెండు లారీలను తాండ్రపాడు వద్ద, డోల్ మీట్ పౌడర్ తీసుకెళ్తున్న మరో లారీని ఉలిందకొండలో శనివారం రాత్రి పట్టుకున్నట్లు ఆయన వెల్లడించారు. వాటికి రూ.84,850 అపరాధ రుసుం విధించామని చెప్పారు. వాహనాల తనిఖీలో రాయల్టీ ఇన్‌స్పెక్టర్ నవీన్, విజిలెన్స్ అధికారులు, మైనింగ్ సిబ్బంది పాల్గొన్నట్లు డీడీ తెలిపారు.

ఆదర్శప్రాయులు ఆంధ్రకేసరి

- టంగుటూరి ప్రకాశం, అమరజీవి పొట్టి శ్రీరాములుకు భారత రత్న ఇవ్వాలి
- ఘనంగా ఆంధ్రకేసరి జయంతి ఉత్సవాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్

కర్నూలు కల్చరల్: ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు ఆదర్శప్రాయులని ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ అన్నారు. ప్రకాశం పంతులు జయంతి ఉత్సవాలను ఆదివారం కర్నూలు నగరంలోని డిగ్రీ కళాశాల, కేవీఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలల్లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నిస్వార్థ రాజకీయ నేత ప్రకాశం పంతులు అని అన్నారు. తన సంపాదనంతా త్యాగం చేసిన మహా పురుషుడన్నారు. టంగుటూరి, అమర జీవి పొట్టి శ్రీరాములు జాతీయ నేతలని వారికి భారత రత్న అవార్డు ఇవ్వాలన్నారు. కర్నూలు నగరంలో ఆయన విగ్రహం ఏర్పాటుకు తన వంతు సహకారం అందిస్తానన్నారు. రూ. లక్ష విరాళాన్ని నిర్వాహకులకు అందజేశారు. క్లస్టర్ వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ డి.వి.ఆర్.సాయి గోపాల్ మాట్లాడుతూ టంగుటూరిని నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. టంగుటూరి గురించి క్లస్టర్ వర్సిటీలో పరిశోధనకు ఒక అధ్యాయంగా పెట్టేందుకు కృషి చేస్తానన్నారు. టంగుటూరి విగ్రహం ఏర్పాటుకు రూ.లక్ష విరాళం ప్రకటించారు. ఏపీ ప్రభుత్వ పూర్వపు ముఖ్య కార్యదర్శి ఐ.వై.ఆర్.కృష్ణారావు మాట్లాడుతూ దేశం, రాష్ట్రం కోసం తన యావదాస్తిని త్యాగం చేసిన త్యాగ పురుషుడన్నారు. రాయలసీమ ప్రాంతం అభివృద్ధికి, ప్రాంతాల మధ్య సమన్వయానికి టంగుటూరి కర్నూలు రాజధానిగా ఒప్పించారన్నారు. ప్రభుత్వ పెద్దలు అన్ని పార్టీల నేతలతో చర్చించి రాజధాని విషయంలో ముందుకు వెళ్లింటే బాగుండేదన్నారు. కళాశాలల ప్రిన్సిపాళ్లు వీవీఎస్ కుమార్, ఇందిరా శాంతి అధ్యక్షతన జరిగిన కార్యక్రమాల్లో చంద్రశేఖర కల్కూర, జేఎస్ఆర్కే శర్మ, కేజీ గంగాధర్‌రెడ్డి, టంగుటూరి ప్రకాశం పంతులు మనుమలు టంగుటూరి శ్రీరామ్, టంగుటూరి గోపాలకృష్ణ మాట్లాడారు. గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గంగాధర్‌రెడ్డి విగ్రహ ఏర్పాటకు రూ.10వేలు విరాళం ప్రకటించారు.ఆంధ్రకేసరి జీవితంపై నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో విజేతలకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బ్రాహ్మణ సంఘం నేతలు మనోహర్ రావు, రాజశేఖర్ రావు, కల్లె చంద్రశేఖర శర్మ, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

విజయవాడలో అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం

కర్నూలు(సెంట్రల్) : విజయవాడలో సెప్టెంబర్ 15వ తేదీన అగ్రిగోల్డ్ బాధితుల శంఖారావం సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామాంజనేయులు అన్నారు. ఈ సమావేశానికి జిల్లా నుంచి అధిక సంఖ్యలో అగ్రిగోల్డ్ బాధితులు, ఏజెంట్లు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం సీపీఐ కార్యాలయంలో శంఖారావానికి సంబంధించిన కరపత్రాలను ఆయన సీపీఐ నగర కార్యదర్శి రామకృష్ణారెడ్డితో కలిసి ఆవిష్కరించారు.

29న ధ్యాన్‌చంద్ విగ్రహావిష్కరణ

కర్నూలు (టౌన్) : స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్ డోర్ స్టేడియం ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన ధ్యాన్ చంద్ విగ్రహాన్ని ఈనెల 29వ తేది జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆవిష్కరించనున్నట్లు హాకీ సంఘం కర్నూలు జిల్లా ప్రధాన కార్యదర్శి దాసరి సుధీర్ తెలిపారు. క్రీడా సంఘాలు విన్నవించగానే కలెక్టర్ స్పందించి విగ్రహం ఏర్పాటుకు కృషి చేయడంపై ఆయన సంతోషం వ్యక్తం చేశారు.

అన్యమతస్తులను తొలగించాలి

కర్నూలు (న్యూసిటీ): స్కాముల్లో ఉన్న వారిని, అన్యమతస్తులను టీటీడీ బోర్డు నుంచి తొలగించాలని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కోరారు. పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.

ఆ టీచర్‌ను సస్పెండ్ చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఉత్తర ప్రదేశ్‌లో ముస్లిం విద్యార్థిపై విషం చిమ్మిన టీచర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని అవాజ్ కమిటీ నగర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు ఇక్బాల్ హుసేన్, మహ్మద్ షరీఫ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉత్తర ప్రదేశ్‌లోని ముజఫర్ నగర్‌లోని ఓ పాఠశాలలో చదువు చెబుతున్న టీచర్ ముస్లిం విద్యార్థులపై విషం గక్కడం అన్యాయమన్నారు. ఈ పరిస్థితిని చూస్తే యూపీలో ముస్లిం మైనార్టీలపై ఎంత దారుణమైన పరిస్థితులు ఉన్నాయో తెలుసుకోవచ్చన్నారు. యోగి సర్కార్ ముస్లింలను అణచి వేస్తోందన్నారు.

జై శ్రీరామ్ ఫౌండేషన్ కమిటీకి అభినందన

కర్నూలు కల్చరల్: జైశ్రీరామ్ ఫౌండేషన్ కర్నూలు ప్రాంత కమిటీని మాజీ రాజ్య సభ్యులు టీజీ వెంకటేష్ అభినందించారు. ఆదివారం ఆయనను కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. టీజీవీ మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రమైన మంత్రాలయం రాఘవేంద్ర స్వామి సన్నిధిలో జైశ్రీరామ్ ఫౌండేషన్ వారు తలపెట్టిన 108 అడుగుల శ్రీరాముని విగ్రహ నిర్మాణ కార్యక్రమం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. భారీ ప్రాజెక్టుకు పూనుకున్న శ్రీధర్, కె.రాములు అభినందనీయులు అన్నారు. ఫౌండేషన్ సభ్యులు ప్రసాద్, హరికిషన్, శ్రీరాములు, రాజశేఖర్, పాల్గొన్నారు

మున్సిపల్ టీచర్ల సమస్యలు పరిష్కరించాలి

కర్నూలు (న్యూసిటీ) : మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఏపీ ఎంటీఎఫ్ (ఆంధ్రప్రదేశ్ పురపాలక ఉపాధ్యాయుల సమాఖ్య) నాయకుడు టి.వెంకటరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఈ అంశంపై విద్యాశాఖ ఉన్నతాధికారులకు కలిసి విన్నవించినట్లు వెల్లడించారు.

స్పోర్ట్స్

కిక్ బాక్సింగ్‌లో సత్యవైభవికి వెండి పతకం



వెండి పతకంతో బాలిక సత్యవైభవి

కర్నూలు(హాస్పిటల్): జాతీయ స్థాయిలో నిర్వహించిన కిక్‌బాక్సింగ్ పోటీలో కర్నూలుకు చెందిన సత్య వైభవి అనే బాలిక వెండి పతకం సాధించింది. విజయ హాస్పిటల్‌లోని ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విజయకృష్ణారెడ్డి కూతురైన ఆమె స్థానిక గుత్తి రోడ్డులోని మాంటె ఇంటర్నేషనల్ స్కూల్‌లో 4వ తరగతి చదువుతోంది. ఆమె ఈ నెల 23 నుంచి 27వ తేదీ వరకు ఝార్ఖండ్ రాష్ట్రంలోని రాంచిలో జరిగిన నేషనల్ కిక్ బాక్సింగ్ (చిల్డ్రన్ కేడెట్స్ అండ్ జూనియర్)లో పాల్గొంది. ఆదివారం జరిగిన పాయింట్ ఫైట్‌లో కేరళకు చెందిన బాలికతో తలపడి వెండి పతకం సాధించింది. ఈ బాలిక నరేంద్ర ఆచారి, లక్ష్మిల వద్ద కిక్ బాక్సింగ్‌లో శిక్షణ పొందారు.

తైక్వాండో పోటీల లోగో ఆవిష్కరణ

కర్నూలు (టౌన్) : వచ్చే నెల 16, 17 తేదీలలో కర్నూలు నగరంలోని యూనైటెడ్ క్లబ్‌లో నిర్వహించే జిల్లా స్థాయి తైక్వాండో పోటీలకు తన వంతు సహకారం ఉంటుందని మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ అన్నారు. ఆదివారం టీజీ తన స్వగృహంలో తైక్వాండో పోటీల లోగోను ఆవిష్కరించారు. అనంతరం తైక్వాండో మాస్టర్లకు ఆయన బ్లాక్ బెల్టులు, సర్టిఫికెట్లు అందజేశారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలు ప్రారంభం

స్థానిక కిడ్స్ వరల్డ్‌లోని రోశయ్య కమ్యూనిటీ హాలులో ఆదివారం కర్నూలు కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మినీ సబ్ జూనియర్, జూనియర్ బాల బాలికల జిల్లా స్థాయి కరాటే పోటీలను మాజీ రాజ్య సభ సభ్యులు టీజీ వెంకటేష్ ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రాండ్ మాస్టర్ బి. రాఘవేంద్ర, ఉదయ్‌కుమార్, ఆర్గనైజర్ ఈశ్వర్ రావు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడిగా అమర్నాథ్‌రెడ్డి



కర్నూలు (టౌన్): జిల్లా సాఫ్ట్ టెన్నిస్ సంఘం అధ్యక్షుడిగా అమర్నాథ్‌రెడ్డి ఎంపికయ్యారు. ఆదివారం స్థానిక నంద్యాల చెక్ పోస్టు సమీపంలోని దివ్య రెసిడెన్సీలో సాఫ్ట్ టెన్నిస్ సంఘం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కేదార్ నాథ్ (సీనియర్ ఉపాధ్యక్షుడు), నవీన్‌కుమార్ (కార్యదర్శి), రోహిత్, గీతాంజలి (సంయుక్త కార్యదర్శులు), వెంకటేశ్వరమ్మ (కోశాధికారి), మహేష్‌బాబు, లక్ష్మీకాంతరెడ్డి కార్యవర్గసభ్యులుగా ఎన్నికైనట్లు ఎన్నికల అబ్జర్వర్ నాగరత్నమయ్య ప్రకటించారు. రాష్ట్ర సంఘం అబ్జర్వర్‌గా రేవంత్, జిల్లా స్పోర్ట్స్ అథారిటీ నుంచి కాశీరావు హాజరయ్యారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన అమర్నాథ్ రెడ్డి మాట్లాడుతూ సాఫ్ట్ టెన్నిస్ క్రీడ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు.

సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయొద్దు

- బాస్కెట్‌బాల్ పోటీల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్



బాల్ వేస్తున్న ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్

కర్నూలు (టౌన్) : విద్యార్థినీ, విద్యార్థులు సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని ఎమ్మెల్సీ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. ఆదివారం స్థానిక బి.క్యాంపు క్రీడా మైదానంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని న్యాయవాది శ్రీధర్ రెడ్డితో కలిసి బాస్కెట్‌బాల్ పోటీలను ప్రారంభించారు. ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఒత్తిడితో కూడిన చదువులతో కుస్తీ పడుతున్న విద్యార్థులు తప్పని సరిగా శారీరక శ్రమ కలిగిన క్రీడలను ఎంచుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ప్రతినిధి దాదాబాషా, క్రీడా సంఘాల ప్రతినిధులు గుడిపల్లె సురేంద్ర, నాగరత్నమయ్య, చిన్న సుంకన్న పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పోటీలు ప్రారంభం

స్థానిక వీకర్ సెక్షన్‌కాలనీ ఉల్చాల రోడ్డులో లాస్య స్విమ్మింగ్ పుల్‌లో అంతర్ పాఠశాలల బాల బాలికలకు స్విమ్మింగ్ పోటీలు నిర్వహించారు. జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు లాంఛనంగా ప్రారంభించారు. అలాగే రైఫిల్ షూటింగ్ పోటీలు స్థానిక అశోక్‌నగర్‌లోని ఆర్‌కే అకాడమీలో అంతర్ పాఠశాలల రైఫిల్ షూటింగ్ పోటీలు నిర్వహించారు. వెయిట్‌లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు తుకారం ఈ పోటీలను ప్రారంభించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీలు ప్రారంభం

స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో ఆదివారం అంతర్ పాఠశాలల పవర్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను స్టేడియం సీఈఓ రమణ పాల్గొని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

కర్నూలు(సెంట్రల్) : తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించి రైతులను ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యవరసభ్యుడు కె.ప్రభాకరరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సీపీఎం బృందం కర్నూలు రూరల్ మండలం ఉల్చాలలో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. కంది, వేరుశనగ, పత్తి, ఉల్లి పంటలు దాదాపు 80 శాతం దెబ్బ తిన్నట్లు రైతులు చెబుతున్నారన్నారు. జూన్, జూలై, ఆగస్టు మాసాల్లో సరైన వర్షాలు పడకపోవడమే ఇందుకు కారణమన్నారు. ప్రస్తుతం వర్షాలు పడినా ఆ పంటలు చేతికి రావన్నారు. నష్టపోయిన పంటలకు ఎకరాకు రూ.25 వేల ప్రకారం పరిహారం చెల్లించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు జి.రామకృష్ణ, రాఘవేంద్ర, అబ్దుల్లా, వెంకటయ్య, శివన్న, ఇస్మాయిల్, రాముడు, బడేసాహెబ్, రంగస్వామి, నాగన్న, తిమ్మప్ప పాల్గొన్నారు.